
# పోతనభాగవతంలో రసగుళికలు
– ఆర్.శర్మ దంతుర్తి



## 25 వ భాగం

## హిరణ్యకశిపుడు, నృసింహావతారం – 2

నృసింహావతారంలో శ్రీహరి బయటకొచ్చాడు కదా? యుద్ధం చేయడానికి హిరణ్యకశిపుడు సిద్ధమై ఉన్నాడు. ఈ కథంతా నారదుడు యుధిష్ఠరిడికి చెప్పడంతో మొదలౌతోంది అని చెప్పుకున్నాం. నారదుడు చెప్తున్నాడు – హిరణ్యకశిపుడు అంత గొప్ప వీరుడు కదా మరి అని ధర్మజుడు అడుగుతాడేమో అనుకుని – ఈ యుద్ధం ఎలా అంతం అవుతుందో.

మ. ప్రకటంబై ప్రళయావసానమున మున్ బ్రహ్మాండభాండావరో
ధక మై యున్న తమిస్రమున్ జగము నుత్పాదించుచోఁ ద్రావి సా
త్త్విక తేజోనిధి యైన విష్ణు నెడ నుద్దీపించునే? నష్టమై
వికలంబై చెడుఁగాక తామసుల ప్రావీణ్యంబు రాజోత్తమా! [7-289]

ప్రళయకాలంలో మొత్తం జగత్తు అంతా పోయినప్పుడు గాఢాంధకారం వ్యాపిస్తే దాన్ని తాగిన సాత్త్విక తేజోమూర్తి మహావిష్ణువు. అటువంటి వాడితో తామసుల యుద్ధ ప్రావీణ్యం అంటే చావు కొనితెచ్చుకుని నష్టమవ్వడమే తప్ప వేరే ఇంకేం జరుగుతుంది?

సీ. పంచాననోద్ధూత పావకజ్వాలలు
భూనభోంతరమెల్లఁ బూరితముగ;
దంష్ట్రాంకురాభీల ధగధగాయితదీప్తి
నసురేంద్రు నేత్రము లంధములుగఁ;
గంటకసన్నిభోత్కట కేసరాహతి
నభ్రసంఘము భిన్నమై చలింపఁ;
బ్రళయాభ్రచంచలాప్రతిమ భాస్వరములై
ఖరనఖరోచులు గ్రమ్ముదేర; [7-291]

తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేతనొడిసి
పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప! [7-291.1]

ఇలా నరమృగేంద్రుడు హిరణ్యకశిపుణ్ణి పట్టుకునేసరికి వాడు అటూ ఇటూ విదిలించి తప్పించుకుని గాలిలో దేగలాగా ఎగురుతూ యుద్ధం సాగించేడు. దాంతో తన కోరల ధగధగ మనే కాంతి రాక్షసుడి కళ్ళు కనపడకుండా చేస్తే (దంష్ట్రాంకురాభీల ధగధగాయితదీప్తి నసురేంద్రు నేత్రము లంధములుగ) జూలు విదిల్చి ఒక్కసారి దితిపట్టిని (దితి కొడుకు, హిరణ్యకశిపుణ్ణి) పైకి ఎగిరి పట్టుకున్నాడు.

క. సరకుగొనక లీలాగతి
నురగేంద్రుఁడు మూషికంబు నొడసిన పగిదిన్
నరకేసరి దను నొడిసిన
సురవిమతుఁడు ప్రాణభీతి సుడివడియె నృపా! [7-292]

వాడు గింజుకుంటూంటే ఇవేమి పట్టించుకోకుండా వాణ్ణి పాము ఎలకని పట్టినట్టూ పట్టుకునేసరికి మృత్యుభయంచేత గడగడలాడిపోయేడు.

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహోద్వృత్తిన్ నృసింహుండు సా
గ్రహుఁడై యూరువులందుఁ జేర్చి నఖసంఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహు దంభోళికఠోరదేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్రహుతాశాంతకభీకరున్ ఘనకరున్ దైత్యాన్వయశ్రీకరున్. [7-295]

గరుత్మంతుడు పాముని పట్టి చీల్చినట్టుగా రాక్షసుణ్ణి తొడలమీద ఉంచుకుని గోళ్ళతో వాడి వజ్రకఠినమైన శరీరాన్ని చీల్చి పడేసాడు. ఇక్కడ హిరణ్యకశిపుణ్ణి పోతన ఏమంటాడంటే, – “దంభోళికఠోరదేహునచలోత్సాహున్ మహాబాహునింద్రహుతాశాంతకభీకరున్ ఘనకరున్ దైత్యాన్వయశ్రీకరున్.” ఎక్కడా కించపరచడం లేదు.

శా. చించున్ హృత్కమలంబు, శోణితము వర్షించున్ ధరామండలిం,
ద్రెంచుం గర్కశనాడికావళులు, భేదించున్ మహావక్షముం,
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా, దుష్టాసురున్ వ్రచ్చి ద
ర్పించుం, బ్రేవులు కంఠమాలికలు గల్పించున్ నఖోద్భాసియై. [7-296]

ఇక్కడ హిరణ్యకశిపుణ్ణి ఎంత కసితో చంపాడో చెప్తున్నాడు. రెండు కారణాలు చెప్పుకోవచ్చు ఈ కసికి – తన రూపుడైన భక్తుణ్ణి నానా బాధలూ పెట్టాడు. ఓ విధంగా చెప్పుకోవాలంటే రాక్షస జన్మ ఎత్తీ పాత కర్మ నివృత్తి చేసుకోకుండా కొత్త కర్మలన్నీ మూటకట్టుకున్నాడు కొడుకుని నానారకాలుగా హింసించి. రెండోది – తమ్ముడికన్నా వీడిలో రాక్షసత్వం ఎక్కువగా ఉంది కాబోలు. అదంతా పోవాలి వంట్లోంచి. హృదయకవాటాల్నీ అన్నింటినీ తెరిచి అన్ని మూలల్లోనూ వెతికి వెతికి ఆ రాక్షసత్వాన్ని విడుదల చేసి విముక్తి కల్పించేదనుకుందాం. ఇదంతా ఎందుకంటే వీడు తనకి అత్యంతాప్తుడైన ద్వారపాలకుడు.

వ. ఇట్లు కేవలపురుషరూపంబును మృగరూపంబునుం గాని నరసింహరూపంబున, రేయునుం బవలునుం గాని సంధ్యా సమయంబున, నంతరంగంబును బహిరంగంబునుం గాని సభాద్వారంబున, గగనంబును భూమియునుం గాని యూరుమధ్యంబునఁ, బ్రాణసహితంబులును బ్రాణరహితంబులునుం గాని నఖంబులం, ద్రైలోక్యజనహృదయ భల్లుం డయిన దైత్యమల్లుని వధియించి, మహా దహన కీలాభీలదర్శనుండును, గరాళ వదనుండును, లేలిహాన భీషణ జిహ్వుండును, శోణితపంకాంకిత కేసరుండును నై ప్రేవులు కంఠమాలికలుగ ధరించి కుంభికుంభ విదళనంబు చేసి చనుదెంచు పంచాననంబునుం బోలె, దనుజకుంజర హృదయకమల విదళనంబు చేసి, తదీయ రక్తసిక్తంబులైన నఖంబులు సంధ్యారాగ రక్త చంద్రరేఖల చెలువు వహింప సహింపక, లేచి తన కట్టెదుర నాయుధంబు లెత్తుకొని తత్తఱంబున రణంబునకు నురవడించు రక్కసులఁ బెక్కుసహస్రంబులం జక్రాధిక నిర్వక్రసాధనంబుల నొక్కనిఁ జిక్కకుండం జక్కడిచె; ఇవ్విధంబున.

[7-299]

ఇలాగ వాడి కోరిక ప్రకారం ఇంట్లో, బయటా కాకుండా, గాలిలో నేలమీద కాకుండా ఎలా చావకూడదనుకున్నాడో దానికి విరుద్ధంగా చంపేసరికి, అక్కడున్న రాక్షసులందరూ యుద్ధానికొచ్చారు. వీళ్ళందర్నీ ఒక్కణ్ణి కూడా విడవకుండా వధించాడు – దేనితో? “జక్రాధిక నిర్వక్రసాధనంబుల.” అంబరీషోపాఖ్యానంలో "భువిదూరన్ భువిదూరు ... హరి చక్రం బన్య దుర్వక్రమై." పద్యం గుర్తుందా? ఇక్కడ కూడా అదే భాష.

శతృవు చచ్చిపోయినా కోపం ఇంకా తగ్గట్లేదు. ఇప్పుడు ఒక్కక్కరూ వచ్చి శాంతించండి అంటున్నారు. ఇక్క రుద్రుడు, బ్రహ్మ, ఋషులు, ప్రజాపతులూ, యక్ష కిన్నరులు అందరూ వేరువేరుగా చెప్పడం చూస్తే వీడు బతికున్నంతకాలం ఎంతమందిని ఎలా ఏడిపించాడో తెలుస్తుంది. ముందు రుద్రుడిలా అన్నాడు.

చ. అమరవరేణ్య! మీఁదట సహస్రయుగాంతమునాఁడు గాని కో
పమునకు వేళ గాదు సురబాధకుఁ డైన తమస్వినీచరున్
సమరమునన్ వధించితివి చాలుఁ ద దాత్మజుఁడైన వీఁడు స
ద్విమలుఁడు నీకు భక్తుఁడు పవిత్రుఁడు గావుము భక్తవత్సలా! [7-308]

సహస్ర యుగాంతాం నాడు కానీ ఇంత కోపం అక్కర్లేదు నీకు. ఇన్నాళ్ళూ దేవతలని కష్టపెట్టాడు కనక వాణ్ణి చంపావు సరే కానీ వాడి కొడుకు నీ భక్తుడే కదా, వాణ్ణి చల్లగా చూడు మరి అంటున్నాడు. ఋషులు ఇలా అన్నారు.

మ. భవదీయాదరలీల లోకముల నుత్పాదించి రక్షింప నేఁ
దవి దైత్యేశునిచేత భేదితములై హ్రస్వంబులై యుండ నీ
యవినీతున్ నరసింహరూపమున సంహారంబు నొందించి వే
దవిధిం గ్రమ్మఱ నుద్ధరించితి గదా ధర్మానుసంధాయివై. [7-312]

రుద్రుడు కోపం గురించి చెప్పేదు సరే మరి ఋషులేమంటున్నారు? ధర్మ రక్షణ జరిగింది. మరి కోపం ఇంకా ఎందుకు? నెమ్మదించండి. పితృదేవతలు అంటున్నారు.

శా. చండక్రోధముతోడ దైత్యుఁడు వడిన్ శ్రాద్ధంబులన్ మత్సుతుల్
పిండంబుల్ సతిలోదకంబులుగ నర్పింపంగ మా కీక యు
ద్దండత్వంబునఁ దాన కైకొను మహోదగ్రుండు; వీఁ డిక్కడన్
ఖండింపంబడె నీ నఖంబుల నుతుల్ గావింతు మాత్మేశ్వరా! [7-314]

హిరణ్యకశిపుడు జనాల్ని ఎలా ఏడిపించుకు తిన్నాడంటే, పితృదేవతలకి శ్రాద్ధాలు కూడా అందలేదుట. సాధారణంగా ఆబ్దీకం పెట్టినప్పుడు ఇవన్నీ చేస్తూ ఉంటారు. ఆబ్దీకం రోజున తండ్రికీ, తాతకీ కూడా పెట్టడం ఆనవాయితీ. ఎందుకిలా చేశాడు మరి హిరణ్యకశిపుడు? విష్ణువుని పట్టుకుందామని. ఎలా ఉంటాడో తెలియదు కదా ముందునుంచీ, అందుకే వీళ్ళందర్నీ నానా హింసలూ పెట్టేడన్నమాట. హింసలంటే తిండీ అదీ లేకుండా చేయడం.
ప్రజాపతులు చెప్తున్నారు ఇప్పుడు.

మ. ప్రజలం జేయుటకై సృజించితి మముం బాటించి; దైత్యాజ్ఞచేఁ
బ్రజలం జేయక యింతకాలము మహాభారంబుతో నుంటి; మీ
కుజనున్ వక్షముఁ జీరి చంపితివి; సంకోచంబు లే కెల్ల చోఁ
బ్రజలం జేయుచు నుండువారము జగద్భద్రాయమాణోదయా! [7-324]

విష్ణువు ప్రజాపతులందర్నీ ప్రజలని సృష్టి చేయమని వినియోగించాడు. వీళ్ళందర్నీ తన చేతుల్లో పెట్టుకుని హిరణ్యకశిపుడు వాడిష్టం వచ్చినట్టూ ఉండడం చేత ప్రజాపతులందులి జీవితం కష్టమైపోయింది. ఇప్పుడు మళ్ళీ మేమందరం మా వృత్తులు సాగిస్తాం నీ చలవ వల్ల అని స్తుతిస్తున్నారు. ఇక్కడ విష్ణువుని పోతన ఏమన్నాడో చూసారా – "జగద్భద్రాయమాణోదయా!" ఇంతమంది ఇలా అన్నా సరే కోపం తగ్గట్లేదు. బ్రహ్మ ఇవన్నీ చూసి ప్రహ్లాదుణ్ణి ముందుకి తీసుకొచ్చి ఒరే నాయనా నువ్వే ఇప్పుడు ఈయన కోపాన్ని తగ్గించగలవు. నువ్వు తప్ప వేరే గతి లేదు మాకు అన్నాడు. వచ్చే వ్యాసంలో, కోపం తగ్గి వరం కోరమంటే భగవంతుణ్ణి ప్రహ్లాదుడడిగే వరం, హిరణ్యకశిపుడుకి మంచి గతి ఎలా కలుగుతుందో చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS